ప్రజాశక్తి
శనివారం 5 నవంబర్ 2022 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఇప్పటంలో అధికారుల అత్యుత్సాహం

- రాజకీయ కక్షతోనే ఇళ్ల కూల్చివేతని ప్రతిపక్షాల ఆగ్రహం
- జిల్లాలో ప్రధాన మార్గాల్లోనూ సింగిల్ లైన్ రోడ్లే దిక్కు
- వెలగపూడికి వెళ్లాలంటేనే వాహనదారులకు నరకం



ఆందోళన చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

తాడేపల్లి మండలం ఇప్పటం ఒక పల్లెటూరు. ఈ గ్రామ జనాభా 4200 కాగా, 1300 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామానికి ఆర్‌టిసి బస్సులురావు. అయితే ఈ గ్రామంలో భారీ రహదారి ఏర్పాటుకు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు విస్తరణకు పూనుకున్నారు. ఒక పల్లెటూరులో 80 అడుగుల రోడ్డు అవసరమా అనే ప్రశ్న ఇక్కడ తలెత్తింది. ఇప్పటికే గ్రామంలో 60 అడుగుల రోడ్డు ఉంది. అయితే ఈ గ్రామంలోకి వెళ్లడానికి మాత్రం చాలా ఇరుకైన 18 అడుగుల రహదారి మాత్రమే ఉండగా గ్రామంలో 80 అడుగుల రోడ్డు ఏర్పాటుకు సన్నద్ధం కావడం రాజకీయ దుమారానికి చెలరేగింది.

రాజధాని గ్రామాల్లో ఇప్పటికీ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా వెలగపూడి సచివాలయం నుంచి విజయవాడ వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సుల్లో వెళు న్న ప్రయాణికులకు నిత్యం నరకం కనబడుతోంది. కృష్ణాయపాలెం, పెనుమాక, ఉండవల్లి వద్ద ఇరుకైన రహదారులు వల్ల ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. వాహనాల రద్దీ పెరిగినా వెలగపూడి నుంచి ఈ గ్రామాల మీదుగా విజయవాడ వెళ్లేందుకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు బాధలు వర్ణనాతీతం. పెనుమాక, ఉండవల్లి వద్దనిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం, సాయంత్రం వేళ బాగా ఇబ్బంది ఎదురవుతోంది. సిఎంతో పాటు పలువురు విఐపిలు ఈ మార్గంలో వెళ్తున్నా ఇంత వరకు ఈ రహదారులను కనీసం నాలుగు అడుగులు కూడా విస్తరించలేదు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో విస్తరణకు అడ్డు చెప్పిన కొంత మంది అడ్డుపడటంతో స్వల్ప విస్తరణతో సరిపెట్టారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతా ఈ రహదారుల విస్తరణకు నోచుకోలేదు. నాలుగు చక్రాలు, ద్విచక్ర వాహనదారులు మాత్రమే వెలగపూడి నుంచి తాళ్లాయపాలెం నుంచి కరకట్ట మీదుగా ఉండవల్లికి వెళ్తుంటారు. కానీ భారీ వాహనాలన్నీ వెంకటపాలెం, కృష్ణాయపాలెం, పెనుమాక, ఉండవల్లి మార్గాల్లోనే జాతీయ రహదారి వైపు వెళ్లాల్సి ఉంది. ఈ మార్గంలో విస్తరణకు నోచుకోకపోవడాన్ని ప్రతిపక్ష పార్టీలు గుర్తు చేస్తున్నాయి.

మంగళగిరి-పెదపరిమి, తాడికొండ, తుళ్లూరు-వెలగపూడి రహదారులు కూడా ఇంత

▶ 2లో



జెబిసిలతో ఇళ్లను కూల్చివేస్తున్న అధికారులు

ఇప్పటంలో ఇళ్లు కూల్చివేత

- ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు
- హైకోర్టు స్టేతో నిలుపుదల

వార్త మెయిన్‌లో

స్పైసెస్ పార్కుకు 11న సిఎం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని వంకాయలపాడు వద్ద ఉన్న స్పైసెస్ పార్క్‌లో ఐటిసి సంస్థ 'గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్'నూ నిర్మించింది. దీని ప్రారంభోత్సవానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11న రానున్నారు. ఈ నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి తదితరులు శుక్రవారం పరిశీలించారు. సిఎం ప్రారంభించే యూనిట్‌తోపాటు హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సభ నిర్వహణ, వేదిక నిర్మాణం తదితర అంశాలపై అధికారులతో మంత్రి రజిని సమీక్షించారు.



ఏర్పాట్ల పరిశీలనలో మంత్రి, అధికారులు

అధ్యక్ష పదవికి సుచరిత త్వరలో గుడ్‌బై!

8లో

అర్ధాకలితో పారిశుధ్యం.. ఆరోగ్యం పణం..

- రాజధాని పారిశుధ్య కార్మికుల ఆవేదన
- రెండోరోజూ పలు గ్రామాల్లో కొనసాగిన ఆకలియాత్ర
- సమస్యలపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

తమ సమస్యలపై రాజధాని పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆకలి యాత్ర రెండోరోజైన శుక్రవారమూ కొనసాగింది. మంగళగిరి మండలం ఎర్రబాలెంలో రెండో రోజు యాత్రను రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి ప్రారంభిచారు. అనంతరం నవులూరు, బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ, తుళ్లూరు మండలం ఐనవోలు, శాఖమూరు, నెక్కల్లులో యాత్ర కొనసాగింది. యాత్ర క్రమంలోనే వివిధ పార్టీల నాయకులు, పెద్దలను కార్మికులు కలిసి తమ ఆందోళనకు మద్దతివ్వాలని కోరారగా అందరూ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎం.రవి మాట్లాడుతూ రాజధానిలోని 29 గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, వారికి జీతమిచ్చి నాలుగో నెల గడిచినా బకాయిలు రూ.కోటి 10 లక్షల 88 వేలను చెల్లించడం లేదని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యం కోసం తమ ఆరోగ్యాలను పణంగా పెట్టే కార్మికులు చివరికి అర్ధాకలితో రోడ్లుడవాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రమంతటా

▶ 2లో

గర్భిణులు, పిల్లలు, విద్యార్థుల్లో 57 శాతం రక్తహీనత

- పూర్తిస్థాయిలో నివారించేందుకు కృషి చేస్తున్నాం
- నాడు-నేడు పనులకు రెండు నెలలుగా ఇసుక కొరత
- పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

2లో

పాస్‌పోర్టు అధికారికి దేహశుద్ధి

మహిళతో అసభ్య ప్రవర్తనపై కేసు

ప్రజాశక్తి - నరసరావుపేట

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో అధికారికి దేహశుద్ధితోపాటు కేసు నమోదైంది. దీనిపై బాధితురాలి వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పెద్ద చెరువు ప్రాంతానికి చెందిన మహిళ పాస్‌పోర్ట్ సేవల కోసం పట్టణంలోని రైల్వేస్టేషన్ 1వ గేటు వద్ద ఉన్న తపాలా కార్యాలయానికి శుక్రవారం వెళ్లారు. ఆమెపట్ల పాస్‌పోర్ట్ అధికారి జగన్నాథరావు అసభ్యంగా

▶ 2లో

అసలే ప్రమాదం.. ఆపై లంచం

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను డబ్బు కోసం పోలీసుల వేధింపు

కానిస్టేబుల్, హోంగార్డు సస్పెండ్

ప్రజాశక్తి-మేడికొండూరు

ప్రమాద విషయంలో బస్సు డ్రైవర్‌ను లంచం కోసం వేధించిన ఇద్దరు పోలీసులను గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీస్ సస్పెండ్ చేశారు. మండలంలోని పేరేచర్ల జంక్షన్‌లో కొద్ది రోజుల క్రితం రోడ్డుపై వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ముందుగా వెళుతున్న లారీని ఢీకొట్టింది. దీంతో ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు స్టేషన్‌కు

▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ నాయక్

ఇతరులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఇతర సామాజిక తరగతులను ఎస్టీల జాబితాలో చేర్చొద్దని గిరిజన సేవాలాల్ సేన సమితి మండల మండల అధ్యక్షులు బాలాజీ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీలకు 75 ఏళ్లుగా రిజర్వేషన్లు పెరగలేదని, ఈ నేపథ్యంలో ఇతరులనూ ఈ జాబితాలో చేరిస్తే ఎస్టీలు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. బోయ వాల్మీకి, బెంతు, ఒరియా సామాజిక తరగతులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వీల్లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఏదైనా సామాజిక తరగతిని ఎస్టీ జాబితాలో చేర్చాలంటే వేష, భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానం, భౌగోళిక పరిస్థితులు పరిగణంలోకి తీసుకోవాలని, జీవో 52ను రద్దు చేయాలని కోరారు.



ప్రత్యేక పారిశుధ్య పనులల్లో అధికారులు, సిబ్బంది

ప్రతి శుక్రవారం డ్రైడే

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని నాగిరెడ్డి పాలేన్ని ఆయుష్ గ్రామంగా ప్రకటించి ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తున్నట్లు ఆయుష్ వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా పెట్టుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, స్వైన్ ఫ్లూ తదితర వ్యాధులు వస్తాయని చెప్పిన ఆయన అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఎస్‌కె.హుస్సేన్, రజినీ, వైద్యారోగ్య సిబ్బంది కోటేశ్వరమ్మ, టి.అంజలిదేవి, అంజి, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎమ్మెల్యే మాటామంతి

ప్రజాశక్తి - నరసరావుపేట

నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని తిలక్ పబ్లిక్ స్కూల్‌లో రూ.55 లక్షలతో నిర్మించనున్న 5 అదనపు తరగతులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం గుడ్డు సైజ్ నాణ్యత పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాలపై విద్యార్థులతో మాట్లాడారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

గర్భిణులు, పిల్లలు, విద్యార్థుల్లో 57 శాతం రక్తహీనత

- పూర్తి స్థాయిలో నివారించేందుకు కృషి చేస్తున్నాం
- నాడు-నేడు పనులకు రెండు నెలలుగా ఇసుక కొరత
- పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



అంగన్వాడి కేంద్రంలో భోజనాన్ని రుచి చూస్తున్న పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - నకరికల్లు

పల్నాడు జిల్లాలో గర్భిణులు, చిన్న పిల్లలు, విద్యార్థుల్లో రక్త హీనత 57 శాతం ఉందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. దీన్ని పూర్తిగా తగ్గించేందుకు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ద్వారా పోషకాలను అంది స్తున్నామని అన్నారు. మండల కేంద్రమైన నకరికల్లులోని ప్రభుత్వ వైద్యశాల, ఎంపియుపి (మెయిన్) పాఠశాల, భవిత విద్యాకేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను ఇన్‌ఛార్జి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి ఐదు రోజులుగా కోడిగుడ్లు సకాలంలో అందించడం లేదని తెలిసి సదరు కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని సిడిపిఒ సిహెచ్ ఉమామహేశ్వరిని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశించారు. భోజన నాణ్యతను, రికార్డులను పరిశీలించారు.

ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు ఆటస్థలం లేకపోవ డం ఆయన దృష్టికి రావడంతో ఎక్కడైన ప్రభుత్వ స్థలం ఉంటే కేటాయిస్తామన్నారు. నాడు-నేడు కింద జిల్లాలో 1134 పాఠ శాలలకు రూ.70 కోట్లు మంజూరయ్యా యని, తరగతి గదులు, ప్రహరీలు, మరు గుదొడ్ల కోసం రూ.45 కోట్లు మం జూరైనట్లు చెపాపరు. పనులకు రెండు నెల లుగా ఇసుక కొరత ఉందని, జిల్లాకు 17,190 మెట్రిక్ టన్నుల ఇసుక అవసర మని తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పథకాలపై అందరికీ తెలిసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం సచివాలయాలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ ఆసుత్రుల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్యలను గుర్తించాలని అధికారు లను ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశించారు. పరి శీలనలో జిల్లా వైద్యాధికారి శోభారాణి, మం డల ప్రత్యేకాధికారి, జి.వరలక్ష్మి ,తహశీల్దార్ సురేష్, ఎంపిడిఒ బి.శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయాధికారి దేవదాసు, పంచాయతీ కార్యదర్శి అరుణప్రియ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పటంలో అధికారుల అత్యుత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

వరకు విస్తరణకు నోచుకోలేదు. బౌద్ధ క్షేత్రం కలిగిన అమరావతి-తుళ్లూరు రహ దారి కూడా ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఒక గ్రామంలో 80 అడుగుల రోడ్డు నిర్మా ణానికి హడావుడి చేసి ఇళ్లను కూల్చి వేత తీవ్ర దుమారం రేపింది. అధికార పార్టీ నేతల తీరు విమర్శలకు గురవుతోంది. అది . కారుల తీరును టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. అవసరమైన చోట రహదారులను అభివృద్ధి చేయకుండా కేవలం రాజకీయ కక్షతో రహ దారుల విస్తరణ పేరుతో ఇళ్ల కూల్చివేతకు పూనుకుంటున్నారని ఆయా రాజకీయ పార్టీలు ప్రభుత్వ తీరును తప్పుపడు తున్నాయి.

తరలించారు. అనంతరం బస్సుకు ఉదయం నుండి కాపలాగా ఉన్నామంటూ కానిస్టేబుల్ వీరబ్రహ్మం, హోంగార్డు మస్తాన్‌వలి బస్సు డ్రైవర్‌తో చెప్పి డబ్బులు అడిగారు. అందుకు డ్రైవర్ కొంత ఇవ్వగా ఒక్కొక్కరికి రూ.రెండేసి వేల చొప్పున రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద లేవని చెప్పగా గూగుల్ పే ద్వారా అయినా ఇవ్వాలని డ్రైవర్‌ను పోలీసులు ఒత్తిడి చేశారు. దీంతో మనస్థాపానికి గురైన డ్రైవర్ గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ ఆదేశంతో విచారణ చేపట్టిన డీఎస్పీ పోతురాజు నివేదికను ఎస్పీకి అందించారు. డబ్బుల కోసం డ్రైవర్‌ను ఒత్తిడి చేశారని నిర్ధారణ కావడంతో కానిస్టేబుల్, హోం గార్డును సస్పెండ్ చేస్తూ ఎస్పీ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

పాస్‌పోర్టు అధికారికి దేహశుద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ప్రవర్తించడంతో ఆమె ఈ విషయాన్ని తన కుటుంబీకులకు తెలిపింది. దీంతో సద రు అధికారికి దేహశుద్ధి చేశారు. అనంతరం బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నింది తుణ్ణి కోర్టులో ప్రవేశపెడతామన్నారు.

కార్మికుల వినతి - ఎమ్మెల్యే హామీ

(మొదటి పేజీ తరువాయి)

తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. జీతాలు రాకపోవడం, రక్షణ పరికరాలు ఇవ్వకపోవడం, బెదిరింపులు, నిర్లక్ష్యం తదితర అంశాల్లో ఏజెన్సీ తీరును ఎమ్మెల్యేకు కార్మికులు, నాయకులు వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరాగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పెండింగ్ జీతాలు ఇప్పించేందుకు, ఇతర సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడతానని హామీనిచ్చారు.

అసలే ప్రమాదం.. ఆపై లంచం

(మొదటి పేజీ తరువాయి)



అర్ధాకలితో పారిశుధ్యం.. ఆరోగ్యం పణం..

(మొదటి పేజీ తరువాయి)

పారి పారిశుధ్య కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలనే జీవో ఉన్నా రాజధానిలో మాత్రం రూ.12 వేలే ఇస్తున్నారని, అది కూడా సరిగా ఇవ్వకుండా కడుపులు మాడుస్తున్నారని మండిపడ్డారు. రాజధాని పారిశుధ్య కార్మికులకు కూడా రూ.15 వేలు జీతం, రూ. 6 వేల మెడికల్ అలవెన్స్ కలిపి రూ.21 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సుమిత్ ఏజెన్సీ జీతాలివ్వకుండా చెలగాటమాడుతుంటే ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఉన్న సిఆర్‌డిఎ చోద్యం చూస్తోందా? అని ప్రశ్నించారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా, రక్షణ పరికరాలు ఇవ్వకుండా తిప్పలు పెడుతున్న సుమిత్ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. పని భద్రత కోసం వీరిని అవుట్సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకోవాలన్నారు. నెలల తరబడి కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని, కొందరికి అసలు ఖాతాలే తెరవలేదని, ఇఎస్‌ఐ కార్డులు కుటుంబ సభ్యులందరికీ కలిపి ఇస్తామంటూనే ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. అనారోగ్యం పాలైన పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్యం కోసం అప్పుల పాలవుతున్నారని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత కొనసాగితే సమ్మె తప్పదని హెచ్చరించారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ కార్మికులు 20 రోజుల నుండి నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఒ.రామారావు, శేషయ్య, ఎం.గోపి, ఎ.జోజి, శ్రీను, రామయ్య, మరియదాసు, వీరాంజనేయులు, రాజారావు పాల్గొన్నారు

మాట్లాడితే భయం పోవడంతోపాటు ఎదుగుతాం

వక్తృత్వ పోటీలపై విద్యార్థులకు జెవివి ఆధ్వర్యంలో అవగాహన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వేదిక భయాన్ని (స్టేజ్ ఫియర్) వక్తృత్వ పోటీలు పోగొడతాయని జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షులు, న్యాయవాది ఎం.ఏడుకొండలు అన్నారు. పట్టణంలోని జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వక్తృత్వం అంటే ఏమిటి? దానిలో నైపుణ్యానికి ఏం చేయాలి? అనే అంశాలను వివరించారు. వివిధ అంశాలపై చిన్నతనం నుండే మాట్లాడ్డం అలవాటు చేసుకోవాలని చెప్పారు. దీని వల్ల భయం పోవడంతోపాటు జీవితంలో ఉన్నతంగా ఎదగడానికీ ఉపయోగపడుతుందని చెప్పారు.



విద్యార్థులకు వివిధ అంశాలను వివరిస్తున్న నాయకులు

కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, హెచ్‌ఎం నాగరాజు, పి.వి కోటేశ్వరావు, నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు బూటకం: ఆలపాటి

ప్రజాశక్తి - తెనాలి



సంక్షేమ పథకాల ముసుగులో ప్రజలను ప్రభుత్వం తీవ్రంగా మోసం చేస్తుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. జన జాగృతి యాత్రలో భాగంగా స్థానిక 23వ వార్డులో శుక్రవారం రాత్రి ఆయన పర్య టించారు. వార్డులోని మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాలు బూటకమని, అర్హులకు నిరాశే ఎదురవుతోందన్నారు. ప్రచారార్భాటం మినహా పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు వైసిపి పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

తెనాలిలో గంజాయి ముఠా గుట్టురట్టు

నలుగురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు

రూ.50 వేల గంజాయి స్వాధీనం



.వివరాలు వెల్లడిస్తున్న డి.ఎస్.పి, సిఐ, ఎస్ఐ, వెనుక వరసలో నిందితుల

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 50 వేల విలువైన కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణ టు టౌన్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం డిఎస్పి కె స్రవంతి రాయి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. అయితానగర్ బిల్లా వారి వీధికి చెందిన చేతబత్తిన అఖిల్, చంద్రబాబు నాయుడు కాలనీ దోనేపూడి వారి వీధికి చెందిన చేబ్రోలు జాన్ విక్టర్, అదే కాలనీకి చెందిన సింహాద్రి పూర్ణచంద్, అయితానగర్ డాంగే వారి వీధికి చెందిన షేక్ బాషా నలుగురు జల్సాలకు అలవాటు పడి, వ్యసనాలకు బానిసలయ్యారు. ఈ నేపథ్యంలో సులభంగా డబ్బు సంపాదించాలన్న భావనతో గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నారు. పట్టణానికి చెందిన వేము నవీన్ అలియాస్ కిల్లర్ నుంచి గంజాయిని కేజి రూ.5 వేలకు కొనుగోలు చేసి, దానిని 20 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి విద్యార్థులకు, అలాగే రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లోని వ్యసనపరులకు రూ.1000కి విక్రయిస్తున్నారు. ఈ ప్రక్రియ ఎంతకాలంగా జరుగుతుందో తెలియదు కానీ, యధావిధిగా ఈనెల మూడున మధ్యాహ్నం నలుగురు నిందితులు ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వేము నవీన్ నుంచి నలుగురూ పావు కేజీ చొప్పున గంజాయి కొనుగోలు చేస్తుండగా, సమాచారం అందుకున్న టూ టౌన్ సిఐ ఎస్ వెంకటరావు అప్రమత్తమయ్యారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై బి శివరామయ్య సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద లభ్యమైన గంజాయి తోపాటు ఉపయోగించిన మారుతి కారుని కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి విక్రయాలకు మూలకారణమైన వేము నవీన్ పరారీలో ఉండగా అతని కోసం ప్రత్యేక బృందం గాలిస్తోందని డిఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గంజాయి విక్రయంపై సమాచారం ఉంటే ఎవరైనా పోలీసులకు సమాచారం ఇవ్వవచ్చన్నారు. టూ టౌన్ సిఐ గా బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే గంజాయి ముఠాను పట్టుకున్నందుకు ఆయనను డిఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సిఐ వెంకటరావుతోపాటు ఎస్సై బి శివరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల వివాదంపై కేసు

ప్రజాశక్తి- మేడికొండూరు

స్థల వివాదంలో ఇరువు వర్గాలపై మేడికొండూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన గడ్డం మల్లేశ్వరి తన ఇంటి ముందు వారసత్వంగా వచ్చిన నాలుగు సెంట్లు స్థలాన్ని బాగు చేసుకుంటుంది. ఆ స్థలం మాది అంటూ అదే గ్రామానికి చెందిన నల్లమోతు సురేష్, నల్లమోతు వెంకట్రావు అనడంతో అక్టోబర్ ఆరో తారీకు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయం పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నప్పటికీ సఖ్యతకు రాలేదు. స్థల వివాదంలో మరో మారు ఇరువర్గాలకు ఘర్షణ జరిగింది. ఇరు వర్గాల పై మేడికొండూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న చదలవాడ

483 క్వింటాళ్లని విజిలెన్స్ చెప్పడం విడ్డూరం

రేషన్ అక్రమ నిల్వలపై ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు చదలవాడ ఫిర్యాదు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో రైస్ మిల్లులపై గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు రేషన్ అక్రమ నిల్వలపై రెక్కీ నిర్వహించి విజిలెన్స్ అధికారులకు సమాచారం అందజేసిన ఘటన తెలిసిందే. ఇదిలా ఉండగా అక్రమ రేషన్ నిల్వలు 2 వేల క్వింటాల్ పైగా ఉన్నాయని, విజి లెన్స్ అధికారులు మాత్రం 483 క్వింటాల్ మాత్రమే ఉన్నా యని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. శుక్రవారం కలె క్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అక్రమ రేషన్ నిల్వ లపై, రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలకు సరఫరా కావాల్సిన రేషన్ బియ్యాన్ని సక్ర మంగా పంపిణీ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనం తరం మీడియాతో చదలవాడు మాట్లాడుతూ నరస రావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అండదండలతో రేషన్ మాఫియా చెల్లరేగిపోతోం దని ఆరోపించారు. గతంలో ఇదే రైస్ మిల్లులో రూ.50 లక్షలకు పైగా విలువ చేసే రేషన్ బియ్యం పట్టుబడిం దన్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి రేషన్ మాఫియాకు చెక్ పెట్టాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మీడియా డివైజ్ ఫీజు వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు చెల్లించకుండా హోర్డింగ్స్, బోర్డులపై ప్రకటనలు అంటించే వాటిని తొలగించటానికి సోమవారం నుండి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళికాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మీడియా డివైజ్ ఫీజుల చెల్లింపులో అడ్వర్టైజింగ్ ఏజన్సీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని కావున బకాయిలు వసూళ్ళపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ఏర్పాటు చేసిన ప్రతి బోర్డ్‌కు ఫీజు చెల్లించాకే ప్రకటనలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనధికార హెూర్డింగ్స్, బోర్డ్‌లను తొలగించాలన్నారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో, ఫ్లై ఓవర్స్ గోడలపై వాల్ పోస్టర్స్ అంటిస్తున్నారని, ఇక నుండి అనధికారికంగా పోస్టర్స్ అంటించే వారిపై, అనుమతి లేకుండా ప్రింట్ చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ఇప్పటికీ అనధికార నిర్మాణాలు సాగుతున్నాయని, అటువంటి వాటిని గుర్తిస్తే ప్లానింగ్ కార్యదర్శితో పాటుగా పట్టణ ప్రణాళిక అధికారి పై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్ల విస్తరణ పనుల్లో నష్ట పరిహారాలు, టి.డి.ఆర్.బాండ్ల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, సిటీ ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏ.సి.పి.లు కాలేష, బాబురావు, అశోక్ కుమార్, అజయ్ కుమార్, టి.పి.ఎస్.లు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ క్రీడాకారులకు ట్రాక్ సూట్లు అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గౌహతిలో నవంబరు 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే జాతీయ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే గుంటూరు జిల్లా అథ్లెటిక్ క్రీడాకారులకు ట్రాక్ సూట్స్‌ను డిఐజి త్రివిక్రమ వర్మ శుక్రవారం అందచేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో వీటిని క్రీడాకారులకు అందించారు. త్రివిక్రమవర్మ మాట్లాడుతూ జాతీయ పోటీల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాకి, రాష్ట్రానికి, స్పాన్సర్ చేసిన సంస్థకి పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా కషి చేయాలని ఆయన కోరారు. రాబోవు రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని అథ్లెటిక్ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న డాక్టర్ కె.రాజశేఖర్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్‌ను క్రీడావివరాలను ఈసందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్, అథ్లెటిక్ కోచ్ కె.రవిలు, అథ్లెటిక్స్ సంఘం సభ్యులు అంకాల సుబ్బారావు, డాక్టర్ కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో డిఐ తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఐ ఖాసిం

స్థానిక చౌత్రా సెంటర్‌లోని ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి యండి ఖాసిం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి ప్రధానోపాధ్యాయురాలు అతహరున్నీసాకు పలు సూచనలు చేశారు. సిబిఎ పరీక్షలకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లను సురక్షితంగా ఉంచాలని విద్యార్థులు అందరూ పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE:GUNTUR
E.A:277/2019 in E.P:252/2017
in O.S:487/2015

Between:
Vaddempudi Sambasiva Rao ...Claimant
And
1.Manne Rama Sankara Rao(DHR)
2.Bolla Sambasiva Rao(JDR)
...Respondents

To,
R2(JDR)
Bolla Sambasiva Rao, S/o. Late Adhaiah,
R/o. Main Road, SivaReddypalem(V),
Pedakakani Mandal, Guntur District.

పై నెంబరు Claim Petition లో 2వ రెస్పాండెంట్(JDR) కు నోటీసు నిమిత్తము వాయిదా 29-11-2022 తేదికి వేసియున్నారు. సదరు వాయిదారోజు పైకోర్టు వారి ఎదుట ఉదయం 10-30 ని॥లకు హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియ పరచకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియపరచటమైనది.

జి.సీతారామిరెడ్డి,
Claimant తరపు న్యాయవాది,
గుంటూరు.

మహారాజశ్రీ విజయవాడ ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి దివ్యసముఖమునకు
ఓ.యస్. 449/2020

బిట్వీన్:
ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడ్ ...వాది
మరియు
జ్ఞానేశ్వరరావు నిట్ట, తండ్రి కామరాజు,
ఆర్/ఓ. ఫ్లాట్ నెం. జి-15, చెంచుపేట, తెనాలి,
గుంటూరు-522201 ...ప్రతివాది

పై ఓ.యస్ నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమనులు అందజేయు నిమిత్తం ది.14-11-2022వ తేదికి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదారోజు ఉదయం గం 10-30ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా కాని, అడ్వకేట్ ద్వారా కాని హాజరు అయ్యి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల వారి పరోక్షమందు పై ఓ.యస్ తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

బై ఆర్డర్
వాయిదా:14-11-2022
విజయవాడ,
ది:3-11-2022.

శ్రీ కునుకు రాజశేఖర్,
వాది తరపు అడ్వకేట్,
గాంధినగర్, విజయవాడ.

ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం 231/2021

బిట్వీన్:-
ఆరె వెంకట రెడ్డి ...వాది
మరియు
అనుముల కృపాల రెడ్డి ...ప్రతివాది
టు
ప్రతివాది: అనుముల కృపాల రెడ్డి, తండ్రి వెంకటరెడ్డి, అంకిరెడ్డిపాలెం గ్రామం, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది.18-11-2022వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున వాయిద తేదిన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 ని॥లకు స్వయముగా గాని లేక వకీలు ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో మీ పై పరోక్షముగా తీర్మానించబమునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:18-11-2022.
సత్తెనపల్లి,
తేది:02-11-2022. **చిట్టా విజయభాస్కరరెడ్డి,**
వాది తరపు న్యాయవాది, సత్తెనపల్లి.

మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఎ.ఎస్. 4/2020

బిట్వీన్:-
అడ్డగిరి రామారావు ...పిటీషనర్/అప్పిలెంటు
మరియు
మాచవరపు అంజమ్మ వగైరాలు
...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
2వ రెస్పాండెంటు: మాచవరపు కిరణ్, తండ్రి.వెంకట్రావు, ఆర్/ఓ. శ్రీరాం నగర్, వెటనరీ హాస్పటల్ వెనుక, సత్తెనపల్లి పోస్టు అండ్ మండలం, పల్నాడు జిల్లా.
4వ రెస్పాండెంటు: తిరువీధుల వాణి, భర్త. శంకర్, ఆర్/ఓ. ఫ్లాట్ నెం.505, మంజునాధ అపార్ట్‌మెంట్స్, సత్తెనపల్లి పోస్టు అండ్ మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు అప్పిల్ లో శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తము ది:29-11-2022 తేదికి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా తేదిన మీరు పై తెల్పిన కోర్టులో స్వయంగా కాని, వకీలు గారి ద్వారా కాని ఉదయం గం॥10-30ని॥లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పై వ్యవహారము పరోక్షంగా తీర్మానించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా:29-11-2022
సత్తెనపల్లి **ఇట్లు**
శ్రీ చలువాది చిన సత్యనారాయణ,
యమ్.ఎ,బి.ఎల్
అడ్వకేట్ సత్తెనపల్లి.

దావా సమన్లు
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్. నెం: 617 / 2022

బిట్వీన్:
వణుకూరి వెంకట రెడ్డి ..... వాది
మరియు
ఘట్టమనేని వెంకటేశ్వర రావు ..... ప్రతివాది
టు,
ఘట్టమనేని వెంకటేశ్వర రావు, తండ్రి కృష్ణా రావు,
నివాసం.డోర్ నెం: 2-40-15, గాంధీనగర్,
తెనాలి టౌన్, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 17-11-2022న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొన వలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:17-11-2022

చెరుకూరి వెంకట శ్రీనివాసరావు,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.
సెల్: 99636 38490



ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ట్యూషన్ సెంటర్

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ట్యూషన్ సెంటర్‌ను శుక్రవారం పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ టి.హనుమంతరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ట్యూషన్ సెంటర్ నిర్వహణకు ఎంతోమంది సహకరిస్తున్నారని, తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా సెంటర్ ఉండాలన్నారు. సిఐటియు జిల్లా నాయకులు జి.రవిబాబు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందని, పిల్లల్ని చదువులో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, విద్యార్థులూ శ్రద్ధ పెంచుకోవాలని కోరారు. అనంతరం సిఆర్‌పి సత్తార్ మాట్లాడారు.



పొలాలల్లో రైతులతో మాట్లాడుతున్న వైవి ఆంజనేయులు

బాధిత రైతులందరికీ పంటల బీమాను వర్తింపజేయాలి

వర్షాలతో దెబ్బతిన్న పత్తి పైర్లను పరిశీలించిన వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి - రాజుపాలెం

అధిక వర్షాలతో దెబ్బతిన్న ప్రత్తి పైర్లను సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని కొత్తూరులో పొలాల్లో పర్యటించి పంట నష్టంపై రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.50 వేల వరకూ నష్టం వాటిల్లిందని ఆయన ఎదుట రైతులు వాపోయారు. అనంతరం వైవి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతుకు పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేయాలని, సబ్సిడీపై విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని తక్షణం రంగంలోకి దింపాలని కోఆరరు. పరిశీలనలో రైతులు డి.ఎల్లయ్య, బి.వెంకటేశ్వర్లు, డి.రత్తయ్య, గోవిందమ్మ, టి.వెంకటేశ్వర్లు, జి.పిచ్చయ్య, కె.సాంబయ్య, బి.సుబ్బారావు, కె.బాలయ్య, వి.వెంకటయ్య, పి.తిరుపాల్, జి.గురవయ్య, కె.రాము, కె.శ్రీను పాల్గొన్నారు.

23-27 తేదీల్లో పల్నాటి వీరారాధన ఉత్సవాలు

ప్రజాశక్తి - కారెంపూడి

పల్నాటి వీరారాధన ఉత్సవాలు ఈనెల 23-27 తేదీల్లో నిర్వహి ంచనున్న దృష్ట్యా అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌ను పల్నాటి వీరచార పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ కోరారు. ఉత్సవాల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు, వీరాచారవంతుల సమక్షంలో సమావేశం నిర్వహిస్తామని తహశీల్దార్ చెప్పారు.



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న తరుణ్ చెన్నకేశవ



జెండావిష్కరణలో నాయకులు, నూతన అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం, హరిపోతురాజు

పాలకుల కుట్రలను కార్మికులు తిప్పికొట్టాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటూరు విజయ్‌కుమార్
- సత్తెనపల్లి పట్టణ మహాసభలో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కార్మికులను ఉన్న హక్కులను హరించడంతోపాటు వారిని బానిసలుగా మార్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, ఈ నేపథ్యంలో కార్మికులంతా ఐక్యమై పాలకుల కుట్ర పూరిత విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటూరు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సిఐటియు పట్టణ మహాసభ స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఆర్.పురుషోత్తం సభ ప్రారంభ సూచికంగా జెండాను ఆవిష్కరించి అనంతరం సభకు అధ్యక్షత వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం 4 లేబర్ కోడ్‌లుగా మారుస్తోందని, ఇవి అమలైతే కార్మికులకు హక్కులేమీ ఉండవని అన్నారు. కనీసం యూనియన్ల ఏర్పాటు, సమ్మె హక్కునూ కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వివిధ రంగాల కార్మికులు తమ సమస్యపై పోరాడి విజయాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.మల్లేశ్వరి మాట్లాడుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రజలు, కార్మికులపై భారాలేస్తున్న ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇందుకు ఐక్య పోరాటాలు అవసరమని చెప్పారు. సందర్భంగా సిఐటియు పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రొంపిచర్ల పురుషోత్తం, కార్యదర్శిగా ఎం.హరిపోతురాజు, ఉపాధ్యక్షులుగా అవ్వారు ప్రసాదరావు, వంగిపురపు చంద్రకళ, సహాయ కార్యదర్శులుగా సిహెచ్ పెద్దవెంకయ్య, జడ రాజ్‌కుమార్, ట్రెజరర్‌గా మర్ల వెంకటేశ్వర్లు, సభ్యులుగా ఎ.డేవిడ్‌రాజు, మైలా రామారావు, నూర్‌బాషా సైదులు, మంద సైలేశ్వరరావు, పులిపాటి రామారావు ఎన్నికయ్యారు. సభలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు పాల్గొని ఉద్యమ గీతాలు ఆలపించారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బంక సరోజిని

పెత్తందార్లను అరెస్టు చేయకుంటే ఉధృత ఉద్యమం

- సర్పంచ్ సరోజిని ఆత్మగౌరవ పోరాటానికి సంపూర్ణ మద్దతు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత, గిరిజన, ప్రజా సంఘాలు ఉద్ఘాటన

ప్రజాశక్తి - బెల్లంకొండ

అత్తులూరు సర్పంచ్ బంక సరోజి పట్ల కుల వివక్ష చూపడంతోపాటు ఆమె విధులకు ఆటంకం కలిగించిన పెత్తందార్లను అరెస్టు చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. సరోజిని చేస్తున్న ఆత్మగౌరవ పోరాటానికి సంఘీభావంగా మండల కేంద్రమైన బెల్లంకొండలో రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జి డి.కృపారావు అధ్యక్షత వహించగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు రాజ్యాంగం ద్వారా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కులను వినియోగించుకుని కొంత మంది ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారని, అయితే వారి అధికారాలను, హక్కులను హరించేలా పాలక పార్టీలు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. అత్తలూరు దళిత, మహిళా సర్పంచ్ బంక సరోజినీనీ ఇదే తరహాలో పెత్తందార్లు మదమంచి సురేష్, మాజీ సర్పంచ్ భర్త సింగమనేని నరసయ్య, పంచాయతీ కార్యదర్శి బిక్కి సుధాకర్, స్వీపర్ వెంకటకృష్ణ వేధిస్తున్నారని, ఆమె విధులకు అడ్డు తగలడమే కాకుండా కులం పేరుతో అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా సర్పంచ్ విధులకు అడ్డంకుల్లేకుండా చూడాలని, సర్పంచ్ ప్రమేయం లేకుండా చేసిన పనులపై విచారణ చేసి అక్రమాలు జరిగితే పెత్తందార్లను బాధ్యులుగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సర్పంచ్ సరోజిని చేస్తున్న పోరాటానికి ప్రజాసంఘాలు, ప్రజల మద్దతు పూర్తిగా ఉంటుందని ఉద్ఘాటించారు. సమావేశంలో బాధిత సర్పంచ్ సరోజిని, కెవిపిఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.రవిబాబు, వివిధ సంఘాల నాయకులు జి.సముద్రం, మరియదాసు, కె.మధు, బాలాజీ నాయక్, శ్రీను, అచ్చయ్య, సిహెచ్ పుల్లారావు, దుర్గారావు, యు.పాపారావు, జి.రాజు, డి.కోటేశ్వరరావు ఎం.బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

- ఆస్పత్రుల్లో వసతులు మరింతగా పెంచి నాణ్యమైన వైద్యం అందించాలి
- పల్నాడు జిల్లా వైద్యాధికారికి వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రభుత్వాస్పతుల్లో మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు వాటిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు సంఘం కార్యాలయంలో శుక్రవారం సమావేశమై ప్రభుత్వాస్పత్రుల్లో వసతులపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి జి.శోభారాణిని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో వసతులన్నీ కల్పించి అంకిత భావంతో పని చేయాలని, ప్రజల్లో నమ్మకం కలిగించాలని కోరారు. ఆస్పత్రుల్లో ఇటీవల వసతులు కొన్ని పెరిగినా ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గైనకాలజిస్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది కొరతను తీర్చాలని, ల్యాబ్ టెక్నీషియన్స్, పరికరాల ఆధునీకరణ పనులు చేపట్టి అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి అన్ని పరీక్షలు పిహెచ్‌సిలు, విలేజ్ క్లినిక్స్‌లో చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, ఉపాధ్యక్షులు కె.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, కోశాధికారి జె.భగత్, నాయకులు బి.కోటమ్మ, ఎస్.లూర్థయ్య, జె.రాజకుమార్, బి.బాలకోటయ్య, పి.సైదాఖాన్ పాల్గొన్నారు.



జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ

ప్రజాశక్తి - దాచేపల్లి : భారత విద్యార్థి ఫెడరేష్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో దాచేపల్లిలోని ఎలిమెంటరీ పాఠశాలలో కరాటే ఉచిత శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. కరాటే మాస్టర్ గుండా మల్లికార్జున్ శిక్షణలో శిబిరం కొనసాగుతుందని, ప్రతి శుక్రవారం, శనివారం నిర్వహించే శిక్షణలో విద్యార్థులు, యువకులు పాల్గొనాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు, యుటిఎఫ్ నాయకులు మస్తాన్‌వలి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.సాయికుమార్ పాల్గొన్నారు.





ఆటో కార్మికులతో మాట్లాడుతున్న బండ్ల మహేష్

గూడ్స్ ఆటో రంగంపైనా కార్పొరేట్ కన్ను

కార్మికుల సమస్యలపై చర్చించేందుకు 11న జిల్లా మహాసభ

ప్రజాశక్తి - మాచర్ల

దేశ వ్యాప్తంగా ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న గూడ్స్ ఆటో రంగంపై ప్రభుత్వం కన్నుపడిందని, దీనిని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పాలకులు చూస్తున్నారని సిఐటియు డివిజన్ అధ్యక్షులు బి.మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పోస్టు ఆఫీసు వద్ద ఆటో స్టాండ్‌లోని రవాణా కార్మికులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మహేష్ మాట్లాడారు. స్వయం ఉపాధి ద్వారా గూడ్స్ ఆటోలను నడుపుకుంటూ కోట్ల మంది నిరుద్యోగ యువత ఉపాధి పొందుతున్నారని, దీంతోపాటు రూ.150 లక్షల కోట్లను వివిధ పన్నుల రూపంలో ప్రభుత్వానికి సమకూరుస్తున్నారని చెప్పారు. ఈ రంగం నుండి కార్మికులను వెళ్లగొట్టడానికి ప్రభుత్వం టాక్స్‌లు, పెనాల్టీలు, లైసెన్స్ ఫీజులను పెంచుతోందని, వీటిని తిప్పికొట్టేందుకు కార్మికులంతా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గూడ్స్ ఆటో వర్కర్స్ సమస్యలపై చర్చించుకునేందుకు ఈ నెల 11వ తేదీన పిడుగురాళ్ల మార్కెట్‌యార్డులో నిర్వహించే యూనియన్ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటరత్నం, శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రామకంఠం సర్వే

సమగ్ర భూ సర్వేపై సమీక్షించిన జెసి రాజకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

సమగ్ర భూ సర్వేలో భాగంగా ఆబాది (గ్రామ కంఠం) సర్వే ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్‌లో డీఆర్సీ సమావేశ మందిరంలో అబాదీ సర్వేపై జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి రీ సర్వే జరిగిన ఫైలెట్ గ్రామాల రెవెన్యూ, పంచాయితీ, సర్వే శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్తిపాడు, దుగ్గిరాల మండలాల్లోని నాలుగు గ్రామాల్లో ఫైలెట్ ప్రాజెక్ట్ క్రింద రీ సర్వే జరిగిందని, ఆ గ్రామాల్లోని గ్రామ కంఠం ప్రాంతం సర్వే చేసి ఆర్ఓఆర్, సర్టిఫికేట్ ఆఫ్ ఓనర్ షిప్ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ కంఠాల సర్వేకి సంబంధించి పంచాయతీ అధికారులు అప్డేట్ చేసిన ఇంటి యజమానుల వివరాలు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. రీసర్వే జరిగిన ఆయా గ్రామాల్లో ఇప్పటికే గ్రామ కంఠాలకు సంబంధించి డ్రోన్ ప్లై జరిగి, ఓఆర్ఐ మ్యాప్స్ కూడా వచ్చి ఉన్నందున ప్రోపర్టీ పార్శిల్ మ్యాప్ ప్రకారం డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌ని వెంటనే పబ్లిష్ చేయాలన్నారు. గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ సర్వేయర్, పంచాయితీ సెక్రెటరీ సహాయంతో రెవిన్యూ ఇన్స్పెక్టర్ ద్వారా డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌ను రూపొందించాలన్నారు. డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌లో భూ విస్తీర్ణాలను ప్రతి గృహ యజమాని పరిశీలించుకునేలా విస్తృత స్థాయిలో గ్రామాల్లో ప్రచారం కల్పించి అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌పై అభ్యంతరాలను అప్పిలేట్ అధికారి హోదాలో డిప్యూటీ తహాశీల్దార్ పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. గ్రామ కంఠాల సర్వేకి సంబంధించి గృహ యజమానుల వివరాలను పంచాయితీ సెక్రటరీ, ఈఓపీఆర్డీ, డిఎల్పీఓ, డీపీఓ పూర్తి స్థాయిలో పరిశీలించి రెవిన్యూ అధికారులకు అందించాలన్నారు. గ్రామ కంఠాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన స్థలాలు నూరు శాతం ప్రభుత్వ స్థలాలుగానే నోటిఫై చేయాలన్నారు. సర్వే జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పంచాయితీ, రెవెన్యూ శాఖకు చెందిన మండల, జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ కె.చంద్ర శేఖరరావు, డిపీఓ కేశవ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్ నాయుడు, విజయ్‌కుమార్, మోవిడి వాణి, సాయిశ్రీ, ఏ.డీ సర్వే రూప్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల జాబితాను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో నిషేధిత భూముల జాబితాను ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సరిచేసి, సత్వరమే అందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి తహాశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ లో రెవిన్యూ అంశాలపై జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి తహాశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత భూముల వివరాల జాబితా (22 ఏ)ను తయారు చేసే క్రమంలో అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములు, చుక్కల భూములు, ఇతర భూములు కేటగిరీ వారీగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం తప్పులకు అవకాశం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సక్రమంగా నమోదు చేయాలన్నారు. రెవిన్యూ అధికారులు అందించిన నిషేధిత భూముల జాబితాను ఆన్లైన్‌లో ఆమోదించి నేరుగా రిజిస్ట్రేషన్ శాఖకు పంపించడం జరుగుతుందని, కావున జాబితా తయారీలో పూర్తి అప్రమత్తంగా వుండాలన్నారు. రీ సర్వేకి సంబంధించి మ్యూటేషన్స్ సక్రమంగా నిర్వహించి సిద్దంగా ఉంచుకోవాలన్నారు. చనిపోయిన వారి పేరుతో, భూములు అమ్మిన వారి పేరుతో ఉన్న రికార్డులను వెంటనే మ్యూటేషన్ చేసి ప్రస్తుతం భూములు ఆధీనంలో ఉన్న వారి పేర్లను నమోదు చేయాలని, దీని కోసం ప్రత్యేకంగా శిబిరాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్ నాయుడు, మోవిడి వాణి, సాయిశ్రీ, ఏ.డీ సర్వే రూప్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జెకెసి కాలేజీలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ, వాణిజ్య విభాగం సహకారంతో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెకెసి కాలేజిలో 'దేశాభివృద్ధి కోసం అవినీతి రహిత భారత దేశం' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుతుల్ని యం.శివాజీ, సిహెచ్.వెంకట విజయకుమార్ యాదవ్, మొహమ్మద్ ఫర్వీజు గెలుచుకున్నారు. వక్తృత్వ పోటీల్లో మొదటి మూడు బహుమతులను జాన్‌సైదా, జి.జయంత్, యం.ఫర్వీజు గెలుచుకున్నారు. పోటీల నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షులు పి.రామ్మోహనరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసే జీవో 21ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

రాష్ట్ర ప్రభుత్వం మోటార్ వాహనాల చట్టం సవరణ చేస్తూ జీవో నెంబర్ 21 ద్వారా చిన్న పొరపాట్లకు కూడా భారీ మొత్తంలో పెనాల్టీలు, డ్రైవర్లకు జైలు శిక్షలు లాంటి ప్రమాదకరమైన నూతన చట్టాలను తీసుకొచ్చారని డ్రైవర్లకు ఇబ్బందికరమైన జీవోను రద్దు చేయాలని ఏ.పి.ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం పెదనందిపాడులో ఆదర్శ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) కాకుమాను మండల మహాసభలో ఆయనపాల్గొన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని, గ్రీన్ టాక్స్ రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. సిఐటియూ జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డ్రైవర్లకు ఏదైనా ప్రమాదం సంభవించినపుడు పూర్తి వైద్యం ఖర్చులు ప్రభుత్వం భరించాలని ప్రమాదావశాత్తు మరణిస్తే కార్మిక కుటుంబాలకు 10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులుగా కె నాగరాజు, పి రవికుమార్, గౌరవాధ్యక్షులుగా కందుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న శివాజి

అరవింద విద్యాసంస్థల వ్యవస్థాపకులు వెంకటరెడ్డి కన్నుమూత

నివాళులర్పించిన వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

అరవింద విద్యాసంస్థల వ్యవస్థాపకులు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన, చాగంటి వెంకటరెడ్డి (75) శుక్రవారం ఉదయం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వెంకట్ రెడ్డి కుమార్తె బొంతు ఇంద్రాణి ప్రస్తుతం అరవింద స్కూల్ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన వెంకట్ రెడ్డి ఐదవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. చాగంటి సాంబిరెడ్డి, ఎర్రమ్మ దంపతులకు ఏడుగురు సంతానంలో, ఐదవ సంతానంగా 1948 డిసెంబర్ 12న కుంచనపల్లి లో జన్మించారు. తల్లిదండ్రులకు చదువు లేకపోవడం, తల్లి ఎర్రమ్మ ప్రేరణతో, ఆయన సోదరుడు చాగంటి సుబ్బారెడ్డి సహకారంతో 1986లో వెంకట్ రెడ్డి గ్రామంలో ఊటీ పబ్లిక్ స్కూల్‌ను స్థాపించారు. అనంతరం కుమార్తె ఇంద్రాణి, కుమారుడు చంద్రశేఖర రెడ్డి లతో 1994లో అరవింద స్కూల్‌ను స్థాపించారు. దినదిన ప్రవర్తమానంతో, అంచలంచెలుగా ఎదిగి, తాడేపల్లి మండలంలోనె ప్రైవేటు విద్యాసంస్థలలో అగ్రగామిగా నిలిచారు. వెంకటరెడ్డి మరణ వార్త తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యాసంస్థల ఉపాధ్యాయులు కుంచనపల్లి లోని ఆయన నివాసంలో భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఐద్వా నాయకురాలు దొంతి రెడ్డి శ్రీనివాస కుమారి, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం కుంచనపల్లి గ్రామ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, సిపిఎం నాయకులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, బి దశరథరెడ్డి, సుందరయ్య సేవా సమితి తాడేపల్లి కన్వీనర్ గాదే సుబ్బారెడ్డి, మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, చేనేత విభాగం రాష్ట్ర నాయకులు గంజి చిరంజీవి, వైఎస్ఆర్సిపి నాయకులు మున్నంగి గోపిరెడ్డి, స్థానిక సంస్థల రాష్ట్ర నాయకులు దొంతి రెడ్డి వేమారెడ్డి, తెలుగుదేశం తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్,, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ నాయకులు కంచర్ల కాశయ్య, మెల్లంపూడి వైయస్ఆర్సీపీ నాయకులు ఆళ్ల వెంకటప్పా రెడ్డి, చాగంటి వెంకటరెడ్డి, ప్రగతి స్కూల్ కరెస్పాండెంట్ పి గిరిజ, ప్రతిభ స్కూల్ కరస్పాండెంట్ కే ప్రసాద్, బొంతు శ్రీనివాసరెడ్డి, వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.




చాగంటి వెంకటరెడ్డి (ఫైల్)

పిఎఫ్ ఖాతాదారులకు 10న అదాలత్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, ప్రకాశం, కృష్టా జిల్లాలకు చెందిన ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారులు, ఆయా సంస్థల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10వ తేదీన అదాలత్ నిర్వహిస్తున్నట్టు ప్రాంతీయ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ తెలిపారు. ఉదయం 10. 30 గంటల నుంచి 12.30 గంటల వరకు నేరుగా సంప్రదించ వచ్చునని, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఆన్‌లైన్‌లో వివరాలు అందివ్వవచ్చునని తెలియజేశారు. తమ సమస్యలను వాట్సాప్ ద్వారా కూడా పంపవచ్చునని తెలిపారు. వాట్సాప్ నంబరు 9494657469 గా పేర్కొన్నారు. అలాగే ఈపిఎఫ్ఓగుంటూరు చిరునామాలో పేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.


నాగేశ్వరరావు అభినందిస్తున్న ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్

నూతలపాటి రచన 'హృదయ గీతికలు' ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి, రచయిత నూతలపాటి నాగేశ్వరరావు రచించిన 'హృదయ గీతికలు' పుస్తకాన్ని ప్రభుత్వం ప్లానింగ్ కమిషన్ కార్యదర్శి జిఎస్ఆరెకెఆర్ విజయ కుమార్ శుక్రవారం గుంటూరు లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణ అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ రచయిత చిన్నప్పటి నుండే సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తని, తనతో బాటు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో కలసి చదువుకున్న రోజులను గుర్తు చేశారు. సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి, సమాజ చైతన్యానికి కథలు, నవలలు రచించడం అభినందనీయమన్నారు. కార్యక్రమములో అతిథిగా పాల్గొన్న ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ 'హృదయగీతికల పుస్తకానికి ముందుమాట రాశానని చెప్పారు. కార్యక్రమములో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ సెక్రటరీ దండె సత్యం, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ కనకదుర్గలు పాల్గొని రచయితను అభినందించారు. తన పుస్తకాన్ని ఆవిష్కరించినందులకు రచయిత నూతలపాటి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



అనిల్ చక్రవర్తికి పలువురు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి చార్టర్ అధ్యక్షులు అనిల్ చక్రవర్తి జన్మదిన వేడుకలు శుక్రవారం మంగళగిరి రోటరీ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి చేపట్టిన సర్వీస్ ప్రాజెక్ట్ రోటరీ చేయూత చక్రాల గురించి అధ్యక్షులు టి సతీష్ వివరించారు. ఈ ప్రాజెక్టులో రోటరీ డిస్ట్రిక్ట్ 3150లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్లు 300 తోపుడు బండ్లు నిరుపేదలకు ఉచితంగా పంపిణీ చేయబడతాయని తెలిపారు. రూ.35 లక్షల ప్రాజెక్ట్ అని తెలిపారు. ఈ సందర్భంగా చార్టర్ అధ్యక్షులు ఐ అనిల్ చక్రవర్తి రూ.50 వేల రూపాయలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆప్ మంగళగిరి మాజీ అధ్యక్షులు ఎం వంశీకష్ణ, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, సభ్యులు పి రాజశేఖర్, పి నిరంజన్ గుప్తా, వి శ్రీనివాసరావు, షేక్ చందాని, అందే మురళి, అందే రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆపదమిత్రలను పటిష్టపరచాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆపదలో ముందుండి సేవలందించేందుకు ఆపదమిత్రలు కృషి చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా అధికారులతో డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఆపదమిత్ర ఎన్నిక, శిక్షణకు సంబంధించి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఆపద మిత్రలకు ప్రథమ చికిత్స, సిపిఆర్ చేయడం, కమ్యూనికేషన్ వ్యవస్థ అందుబాటులో ఉంచుకోవడం అవసరమన్నారు. జిల్లాలో ఆపదమిత్రలను పటిష్టపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ ఎఫ్, పోలీస్, అగ్ని మాపక శాఖ తదితర శాఖ అధికారులతో వారికి శిక్షణ తరగతులు నిర్వహించి వారికి అవగాహన పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 19 నుండి 12 రోజుల పాటు కోటప్ప కొండ వద్ద ఉన్న డిఆర్డిఏ ప్రాంగణంలో శిక్షణ తరగతులు క్రమ పద్ధతిలో పటిష్టంగా నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులు ఆపదమిత్రల డేటాను అందుబాటులో ఉంచుకోవాలని, సరైన, సేవా దక్పథం ఉండే వారిని ఆపద మిత్రలుగా ఎన్నిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీవినాయకం, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జ్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్



పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-ఈపూరు

గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి పిడి, మండల ప్రత్యేక అధికారిణి బి.అరుణ అన్నారు. మండలంలోని భద్రుపాలెం, బొమ్మరాజుపల్లి లోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఫ్రీ స్కూల్స్‌కు పంపించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదని ప్రైవేటు కాన్వెంట్ల వైపు మొగ్గు చూపుతున్నారని అంగన్వాడీ కార్యకర్తలు చెప్పడంతో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఫ్రీ స్కూల్స్ లో నమోదు పెంచాలని వారికి సూచించారు. అంగన్వాడి కేంద్రంలోని పిల్లల ఎదుగుదలను వైద్యురాలు షేక్ షమీమా పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఎనీమియా లోపం ఉన్న విద్యార్థులకు మందుల పంపిణీపై ఉపాధ్యాయులతో చర్చించారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటింటా వైద్యం 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ముక్తియార్ జాని అన్నారు. 'ఫ్యామిలీ డాక్టర్' విధానంలో భాగంగా శుక్రవారం కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక లంకమోడులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం హౌస్ విజిట్ ద్వారా టిబి రోగులను, బాలింతలను ,గర్భిణిలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

బోరు వేయించిన మాగులూరి ఫౌండేషన్

ప్రజాశక్తి - పెదకూరపాడు

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అబ్బరాజుపాలెంలో వినాయక దేవాలయం వద్ద శుక్రవారం బోరు వేయించారు. భక్తులకు నీటి వసతి నిమిత్తం బోరు వేయించామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.కృష్ణారావు, కె.కిరణ్, జి.భాస్కర్‌రావు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

నిర్మల హైస్కూల్‌లో కోచింగ్ క్యాంపు

ప్రజాశక్తి - వినుకొండ

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాలికలు అండర్ 16 సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంపును స్థానిక నిర్మల ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ శంకర్‌రావు శుక్రవారం తెలిపారు. 5 తేదీ నుంచి 10 వరకు కోచింగ్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 11 నుంచి 13 వరకు ప్రకాశం జిల్లా గూడూరు మండలం చేవూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు పాల్గొంటారని వివరించారు.

199 గృహాల నిర్మాణానికి అనుమతి

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రధాన మంత్రి గ్రామీణ యోజన పథకం కింద మండలంలో 199 గృహాల నిర్మాణానికి అనుమతి లభించినట్లు గృహనిర్మాణ శాఖ ఎఇ సి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మొత్తం 707 గృహాలు మంజూరు కాగా తొలి దశలో 199 నిర్మిస్తామని, వీటికి జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్ చేస్తున్నామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం నుండి అందుతాయని పేర్కొన్నారు.



గణపవరంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి అంబటి

ప్రభుత్వ పథకాలతో ఆర్థికస్వావలంబన

ప్రజాశక్తి - రాజుపాలెం

గత మూడేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక స్వావలంబన కలిగించామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం గణపవరంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంబటి మాట్లాడుతూ సచివాలయం పరిధిలో గత మూడేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ల సేవల గురించి ఆరా తీశారు.

'గడపగడప'లో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను ఆదేశించారు. సిసి రోడ్లు, కల్వర్టులు, సైడ్ డ్రైన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి మౌలిక వసతులు కల్పనకు సచివాలయ నిధులు వెచ్చించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, ఎంపిపి టి.రాజేశ్వరి, సర్పంచ్ టి.వెంకటరమణ బుల్లిబాబు, ఎంపిటిసి ఎం.నందనం తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబసభ్యులకు అండగా ఉంటాం

అదనపు ఎస్పీ బిందు మాధవ్

ప్రజాశక్తి - నరసరావుపేట

విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పోలీసుల కుటుంబసభ్యులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కార్యాలయంలో చేయూత పథకం ద్వారా ఆయా కుటుంబాలకు రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందు మాధవ్ అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మృతులు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రమావత్ రమణ నాయక్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు చేసిన సేవలు ఎనలేనివని, వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి ఏ ఇబ్బంది కలిగినా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ రమణారెడ్డి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న అదనపు ఎస్పీ బిందు మాధవ్

అర్హులకు పథకాలు అందకపోతే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఈపూరు

అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోతే బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని అంగలూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. గ్రామంలో తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామానికి చెందిన ఓ మహిళ తాను అమ్మఒడి పథకానికి అర్హత కలిగి ఉన్నప్పటికీ రెండేళ్లుగా ఈ పథకం తనకు అందలేదని ఎమ్మెల్యే బొల్లాకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల వివరాల నమోదులో నిర్లక్ష్యంగా ఉన్న ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లపై చర్యలు ఉంటాయన్నారు. స్పందనలో ఫిర్యాదు చేయాలని వారికి సూచించారు. అధ్వానంగా ఉన్న రోడ్డు గురించి గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారని, దాని నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బ్రహ్మనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి టి.చౌడయ్య, తహశీల్దార్ సిహెచ్ విజయ్ జ్యోతికుమారి, ఎంపిడిఒ ఎ.ఉషాకిరణ్, సర్పంచ్ ఎస్. కుసుమ, మండల కన్వీనర్ కె.దేవరాజ్, శాఖమూరి బుచ్చయ్య, జి. వెంకట హనుమయ్య, ఎస్.ఏడుకొండలు పాల్గొన్నారు.



అంగలూరులో సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

అంగన్వాడి సెంటర్‌లో ప్రత్యేక అధికారి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని అంగన్వాడి సెంటర్‌ను ప్రత్యేక అధికారి కె.కాంతారావు పరిశీలించారు కార్యక్రమంలో అంగన్వాడి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, బాలింతలు, గర్భిణిలకు అందుతున్న ప్రభుత్వ సేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి పి.మాధురి, పలువురు అధికారులు ఉన్నారు.



అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కాంతారావు తదితరులు



తెగులు సోకిన వరిని పరిశీలిస్తున్న ఏవో రామారావు

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ళ నివారణ

ప్రజాశక్తి-ఈపూరు


మండలంలోని కొచ్చర్లలో తెగులు సోకిన వరి పొలాలను ఏవో రామారావు శుక్రవారంపరిశీలించారు. అగ్గి తెగులు, ఆకుమచ్చ, ఆకులు ఎండుట గుర్తించినట్లు చెప్పారు. ఎంచుకున్న వరి వంగడాలు, వాతావరణం, మంచు వలన ఈ తెగుళ్లు వస్తాయన్నారు. అగ్గి తెగులు నివారణకు ఒక ఎకరానికి 120 గ్రాములు ట్రైసోక్లన్ పిచికారి చేయాలని, ఆకుమచ్చ, ఆకు ఎండిపోవుట నివారణకు ఒక లీటర్‌కు ఐదు గ్రాముల సుడోమోనాస్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. సూడోమోనాస్ అన్ని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. యూరియాను అధికంగా వినియోగిస్తున్నారని, నత్రజని ఎరువులు అధికంగా వాడటం ద్వారా తెగుళ్లు అధికంగా సోకే అవకాశం ఉందని తెలిపారు ఏఓతో పాటు ఏఈఓ అప్పారావు ఉన్నారు.



కంపోస్ట్‌పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పురపాలక సంఘం స్వచ్ఛ తాకే దోరంగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పండరీపురంలోని ఇళ్లల్లో తడి చెత్త ద్వారా కంపోస్ట్ తయారు చేసి దానిని పూల మొక్కలకు ఎరువుగా ఎలా వాడాలో అవగాహన కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ సి.హెచ్.గోవిందరావు చెప్పారు. ఆరోగ్యం కోసం ఆర్గానిక్ కూరగాయలు ఇంట్లో పండించుకునేందుకు తడి చెత్త ద్వారా కంపోస్ట్ తయారు చేసుకుని అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కంపోస్టును నల్ల బంగారంగా పరిగణిస్తారు కనుక ప్రజలందరూ తడి చెత్తను తమ ఇళ్లల్లో కంపోస్టు తయారు చేసి పర్యావరణ పరిరక్షణకు , స్వచ్ఛ చిలకలూరిపేటకు సహకరించాలని కోరారు.



వీణ వాయిద్యంలో గెలుపొందిన డాక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇటీవల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు వై.మధులత వీణ వాయిద్యంలో ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ధూళిపాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధులతను వారి హాస్పిటల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ సమాజ సేవకులు చుక్క విన్సంట్‌పాల్ మాట్లాడుతూ మధులత సేవా రంగంలోనే కాక, సంగీత రంగంలో కూడా విశేష ప్రతిభ కనబరుస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధూళిపాల ఫౌండేషన్ చైర్మన్ ధూళిపాల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ర్యాలీ చేసినందుకు కేసు : సిఐ

ప్రజాశక్తి - మాచర్ల

అయ్యన్నపాత్రుడు ఆరెస్టుకు నిరసనగా పట్టణంలో అనుమతి లేకుండా గురువారం ర్యాలీ నిర్వహించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సిఐ బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. అనుమతి లేకుండా ర్యాలీ చేయడంతోపాటు ఆరెస్టు చేయబోయిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, దీనిపై చారని టిడిపి నాయకులు కుర్రి శివారెడ్డి, కొమెర దుర్గారావు, మున్నా రాంబాబు తదితరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రధాన రహదారిపై సిసి కెమెరాలు

పట్టణంలోని ప్రధాన రహదారిలో సిసి కెమోరాలు ఏర్పాటు చేయనున్నట్లు పట్టణ సిఐ బాలకృష్ణ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడాఉ. ట్రాఫిక్ నియంత్రణ, నేర నివారణ కోరకు సిసి కెమోరాల అవసరమన్నారు. వీటి ద్వారా పోలీసుస్టేషన్ నుండి ప్రధాన రహదారిపై పరిశీలన చేస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు, నంబర్ల ఆట ఆడించేవారు వారు తమ పద్ధతులు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం సురక్షితం

ప్రజాశక్తి - దుగ్గిరాల : కరోనా అనంతరం ఆహారంపై అవగాహన పెరిగిందని, ప్రకృతి వ్యవసాయం ఆధారంగా పండిస్తున్న పంటలకు గిరాకీ పెరిగిందని గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె రాజకుమారి అన్నారు .మండలంలోని పెదపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ పంటలు పండిస్తున్న సర్పంచ్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించడానికి శుక్రవారం వరల్డ్ రిసోర్స్ ఇనిస్టిట్యూట్ బృందంతో కలిసి ఆమె పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ విధానం వల్ల విచక్షణా రహితంగా ఎరువులు పురుగు మందులు వాడుతున్నారని దీనివలన భూసారం తగ్గి పంట భూములు బీడు బారిపోతాయన్నారు. ప్రకతి వ్యవసాయం వలన భూ సారం తగ్గదని, చీడపీడల బాధ ఉండదని, నాణ్యమైన పంటలు పండి రైతుకు ఎక్కువ ధర లభిస్తుందన్నారు. వరల్డ్ రిసోర్స్ ఇనిస్టిట్యూట్ కు చెందిన సంచిత దాస్ జి.వూర్జా ,మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష, ఏఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అన్నపర్రులో ముగిసిన రైతు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం వారి ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ వారి సహకారంతో మండలంలోని అన్నపర్రులో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న రైతు శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ గురించి జిల్లా ఉద్యాన శాఖ అధికారులు ఎన్ .సుజాత, ఎం.బేబి, పత్తిలో సమగ్ర సస్యరక్షణ గురించి డాక్టర్ వీరబాబు. డాక్టర్ దక్షిణామూర్తి.డాక్టర్ సురేష్ లు రైతులకు పలు సూచనలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. సుధారాణి ఎంపిటిసి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మిరపలో నల్లతామర పురుగు

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని కం తేరులో మిరప పొలా లను జిల్లా ఉద్యాన అధి కారి ఎన్.సుజాత శుక్ర వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు.మిరప పంటలో గత ఏడాదిలో వచ్చిన నల్ల తామర పురుగు ఇప్పుడే గమనించడం జరిగిందన్నారు.నల్ల తామర ఉధృతి పెరగక ముందే రైతులు సామూహికంగా నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 30 నుండి 40 వరకు ఏర్పాటు చేయాలని, వేప సంబంధిత పురుగు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి అశోక్‌రెడ్డి, సహాయకులు పార్ధసారధి పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రావీణ్యులను చేయండి

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే శ్రీదేవి



ప్రజాశక్తి- ఫిరంగిపురం

మండలంలోని మునగపాడు జడ్పీహెచ్ పాఠ శాలను తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధన విషయమై ఆరా తీశారు. బోధన అనేది జ్ఞాపకశక్తి పెంపొందించేలా ఉండాలని, సంబంధిత సబ్జెక్టులలో విద్యా ర్థులను ప్రావీణ్యులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించడమే నాడు-నేడు పథకం లక్ష్యమని, రాష్ట్ర విద్యా విధానంలో వినూత్న మార్పులు సంభవించాయ ని, రాష్ట్రంలో చదువుల విప్లవం వెల్లివిరుస్తోందన్నారు. జగనన్న గోరు ముద్ద, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల గురించి ప్రస్తావించారు. పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో విద్యను అందించడం వల్ల వారి జీవితాల్లో మార్పులు వస్తాయని సీఎం జగన్ భావిస్తే, చంద్రబాబు మాత్రం అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. **మేడికొండూరు:** సచి వాలయం-2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆయా విభాగాల గ్రీవె న్సును తప్పని సరిగా రికార్డులో నమోదు చేయాలన్నారు. సత్వరమే సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత సచివాలయాన్ని సందర్శించారు. గర్భిణిలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

పేదల ఇళ్లను కూల్చడమే వైసిపి లక్ష్యం

టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు



ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పేదల ఇళ్లను కూల్చడమే వైసిసి ప్రభుత్వ లక్ష్యమని, తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు అన్నారు. శుక్రవారం రాత్రి మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని. కుంచన పల్లిలోని తెలుగుదేశం తాడేపల్లి మండల కార్యాలయంలో తెలుగుదేశం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధి కారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వేదికను కూల్చడంతో తన అరాచక పాలనను మొదలు పెట్టారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న ఇప్పటంలో ప్రజలు భయభ్రాం తులకు గురవటానికి వైసిపి కారణమని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా, కక్ష సాధింపు ధోరణితో వ్యవ హరించడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్ష పార్టీలను అరెస్టులతో ఆపలేరని అన్నారు. సమావేశంలో టిడిపి తాడేపల్లి పట్టణ నాయకులు జంగాల సాంబశివరావు, సీనియర్ నాయకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, నాయకులు కానుగొలు కోటేశ్వరరావు, బిరుదుగడ్డ రమేష్ తురక ఏలియా, తదితరులు పాల్గొన్నారు. **దుగ్గిరాల :** ఇప్పటం ఆందోళనలో టిడిపి, జనసేన నాయకులను 14 మందిని అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్ స్టేసన్‌కు తీసుకువచ్చారు. వీరిని టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు, నాయకులు అమర సుబ్బారావు పరామర్శించారు. మండల టిడిపి అధ్య క్షులు కేశంనేని శ్రీఅనిత, మండల పార్టీ నాయకులు పోలీసు అదుపులో ఉన్న వారిన పోలీస్ స్టేషన్కు వచ్చి పరామర్శించారు. పోలీసులు అదుపులో తీసుకున్న వారిలో తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు జనసేన పార్టీ నాయకులు కూడా ఉన్నారు.

ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం సరికాదు

ప్రజాశక్తి - తాడేపల్లి

నలభై ఏళ్ళ నుండి నివాసముంటున్న పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించకుండా ఇళ్లు కూల్చడం సరికాదని ప్రభుత్వంపై టిడిపి పట్టణాధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు విమర్శించారు. పట్టణంలోని 14వ వార్డులో లంబాడిపేట తదితర ప్రాం తాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వ హించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి డి.దాసు, ఎన్. గోపాలరావు, డి.సుందరరావుయాదవ్, ఎ.మురళి, సాయిచంద్, దుర్గారావు, కుసుమ, కె.జ్యోతి, మౌనిక పాల్గొన్నారు.



లంబాడిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి కార్యకర్తలు

సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్



ప్రభుత్వ పాఠశాల ల్లోని ప్రాథమిక, ప్రాథమి కోన్నత పాఠశాలల విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు అందుబాటు లోకి వచ్చాయని మండల విద్యా ధికారి మేకల లక్ష్మి నారాయణ చెప్పారు. స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూల్‌కు పుస్తకాలు చేరాయని మండల పరిధిలోని పాఠశాలల ఉపా ధ్యాయులు పుస్తకాలను ఒకటి, రెండు రోజుల్లో తీసుకు వెళ్ళాల్సిందిగా కోరారు.

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది : టిడిపి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 17వ వార్డులో శుక్రవారం సాయంత్రం బాదుడే బాదుడు కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలను మోపిందని విమర్శించారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, దామర్లరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో సిపిఆర్ పై అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ లో శుక్రవారం సిపిఆర్ పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో మంగళగిరి ఎయిమ్స్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ టీఎస్ రవికుమార్ మాట్లాడుతూ మనిషి మతి చెందకుండా, బ్రెయిన్ డెడ్ అవ్వకుండా చూడడమే సిపిఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ అడిషనల్ డీజీపీ శంకబ్రత్త బాబ్జి, కమాండెంట్ కె ఎస్ వి వి సుబ్బారెడ్డి, అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్, వైద్యులు కె.జ్యోతి, ఎం.గౌతమ్, సురేష్, అర్చన, కవిత తదితరులు పాల్గొన్నారు.



ఫీడర్ బ్రేకర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలులోని విద్యుత్ సబ్ స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్ బ్రేకర్లను పొన్నూరు స్థానిక శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య శుక్రవారం స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.చేబ్రోలు ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని తమ దృష్టికి తీసుకురావ డం జరిగిందని, సమస్య పరిష్కారం దిశగా అధికారులతో చర్చించి ఫీడర్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటి డీఈ చిరంజీవి, ఏఈ సుధీర్, చేబ్రోలు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



బుర్రకథ కళాకారిణి సంషున్నీసాకు సత్కారం

ప్రజాశక్తి -తెనాలి రూరల్

శకపురుషుని శతజయంతి మహోత్సవాల సందర్భంగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పెమ్మసాని థియేటర్లో సంవత్సరం పాటు జరుగనున్న ఎన్టీఆర్ ఉచిత సినిమా ప్రదర్శనలలో భాగంగా (సోమవారం నుండి శుక్రవారం వరకూ) శుక్రవారం శంగార రాముడు చిత్రాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో చిత్రాన్ని తిలకించారు .శత జయంతి సత్కారాల పండుగ (రోజుకొక కళాకారునికి సత్కారం) కార్యక్రమంలో భాగంగా ప్రముఖ బుర్రకథ కళాకారిణి సంషున్నీసా ను అన్నం మల్లేశ్వరి, కొరివి సుభాషిణి,ఎం.సరోజిని, వెంకటరమణ సత్కరించారు. కార్యక్రమంలో దేవరపల్లిభవాని,ఈదర శ్రీనివాసరావు,ఎన్టీఆర్ జగన్,ముప్పనేని రాఘవరావు, సోమవరపు సాంబశివరావు, గుమ్మడి ప్రసాద్,శ్రావణ్,డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్సిటీ సిబ్బంది సమయ పాలన పాటించాలి : విసి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సిబ్బంది సమయపాలన పాటించాల్సిన అవసరం ఉందని లేదంటే చర్యలు తప్పవని వర్సిటీ వీసీ పి రాజశేఖర్ పేర్కొన్నారు. వర్సిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో శుక్రవారం దినసరి వేతన ఉద్యోగుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులు క్రమశిక్షణ తో, వృత్తి పట్ల విశ్వాసంతో మెలగాలని సూచించారు. విధులకు భిన్నంగా వ్యవహరించినా, అవినీతి కి పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, దినసరి వేతన ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న హీరో, హీరోయిన్, తదితరులు

ఆర్‌విఆర్‌లో ప్రేమదేశం చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో శుక్రవారం 'ప్రేమదేశం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్రయూనిట్ విద్యార్థులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు శ్రీకాంత్ సిద్ధం మాట్లాడుతూ ఇటీవల ఘన విజయాలు సాధించిన లై, చల్‌మోహనరంగా చిత్రాల్లో హీరోయిన్‌గా నటించి అందరి మన్ననలు పొందిన మేఘా ఆకాష్ ఈ చిత్రలో హీరోయిన్‌గా, హీరోలుగా ఆదిత్, శివ నటించిన ఈ చిత్రం విభిన్న కథాంశంతో రూపొందించామని చెప్పారు. కొత్త సందేశంతో తీసిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిత్ర హీరో, హీరోయిన్‌లు కళాశాల విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేశారు. కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ యువతపై సినిమాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, విలువలతో కూడిన, స్ఫూర్తి నింపే చిత్రాలు నేటి సమాజానికి ఎంతో అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ శ్రీనివాసరావు చిత్ర బృందాన్ని సన్మానించారు.

గుండెలోకి నీరు - అధునాతన శస్త్రచికిత్సతో తొలగింపు

జిజిహెచ్ వైద్యుల కృషి విజయవంతం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఊపరితిత్తులు, గుండె భాగాల్లోకి నీరు చేరడం వల్ల తీవ్ర అస్వస్తతకు గురైన ఒక రోగికి ఆధునిక పద్ధతుల్లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. బాపట్ల జిల్లా నందిరాజు తోట కు చెందిన 23 ఏళ్ళ వయస్సు గల పి వంశీ కృష్ణ ఊపిరితిత్తులు.. గుండెలో నీరు చేరడంతో గత నెల 25 వ తేదీన ఆసుపత్రిలో చేరారు. గుండె విభాగం అధిపతి డాక్టర్ కళ్యాణి రమ రోగిని పరిశీలించి పరీక్షలు చేశారు. ఊపిరితిత్తులు, గుండెలో నీరు చేరడంతో లెన్స్‌కు ఫ్లోరా పొర మధ్య రంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ నెల మూడో తేదీన డాక్టర్ కళ్యాణి రమ వారి బృందంతో పాటు అనస్తిషియా హెచ్‌ఒడి డాక్టర్ విష్ణు మహేష్ ఎలాంటి కోత కుట్టు లేకుండా రంధ్రాన్ని థోరాకోస్కోపి ద్వారా విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని రెండు మూడు రోజుల్లో ఇంటికి పంపిస్తామని సి టి. సర్జరీ హెచ్ ఒడి డాక్టర్ డి కళ్యాణి రమ అన్నారు. రోగికి సకాలంలో పరీక్షలు చేసి విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన వైద్య బందానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అభినందించారు.

అధ్యక్ష పదవికి సుచరిత త్వరలో గుడ్‌బై!

ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా మాత్రమే కొనసాగాలని నిర్ణయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



త్వరలో వైసిపి జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోనున్నట్టు పత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వెల్లడించారు. నియోజకవర్గం పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె గోరంట్లలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీ జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు నుంచి కొద్దిరోజుల్లో తప్పుకుంటానని తెలిపారు. ఈమేరకు త్వరలో తన రాజీనామాలేఖ పంపుతానని అన్నారు. పత్తిపాడు నియోజక వర్గం అభివృద్ధికి పరిమితం కావాలి అనుకుంటున్నట్టు తెలిపారు. మంత్రి పదవి నుంచి తప్పుకున్నతరువాత ఆమె గత కొంత కాలంగా జిల్లా రాజకీయాల్లో చురుకైనపాత్ర పోషించడం లేదు. వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా కేవలం ఎమ్మెల్యేగానే పరిమితం కావాలని యోచిస్తున్నట్టు గత కొంతకాలంగా పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆమె స్వయంగా పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు వివరించారు. కొత్త అధ్యక్ష బాధ్యతలు పార్టీలో ఎవరికి ఇస్తారన్నదీ ఇంకా స్పష్టత రాలేదు.

అబ్బుర పరుస్తున్న ఇస్రో, డిఎఇ వైజ్ఞానిక ప్రదర్శనలు

ఎస్‌ఆర్‌ఎంలో రెండవ రోజు సైన్స్ అకాడమీ వార్షిక సదస్సు ప్రారంభం

ఐఐటీ, ఐఐఎస్సీల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శుక్రవారం ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 88వ వార్షిక సదస్సులు ప్రారంభమయ్యాయి. ఏపీజే అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో అకాడమీ ప్రెసిడెంట్ ఆచార్య ఉమేష్ వాగ్మారే జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సులను ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో వాగ్మారే అకాడమీ లక్ష్యాలు, ప్రగతిని, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రచారం కోసం జరుగుతున్న కృషిని వివరించారు. అనంతరం అకాడమీలో సభ్యత్వం తీసుకున్న ప్రతినిధులను ప్రకటిం చారు. వార్షిక సదస్సులకు ఆతిథ్యం ఇస్తున్న ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ, 88వ వార్షిక సదస్సుల నిర్వహణకు అవకాశం ఇవ్వడం తమ అదష్టంగా భావిస్తున్నామన్నారు. బోధన, పరిశోధనలకు ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ పెద్దపీట వేస్తుందన్నారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కే అరోరా మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీ, ఐఐఎస్సీలతో పాటు ప్రతిష్టాత్మక విద్యా, పరిశోధనా సంస్థల నుంచి పెద్ద మొత్తంలో ప్రతినిధులు హాజరు కావడం విశేషమన్నారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అకాడమీ కార్యదర్శి రెనీ మోజస్ కోరారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రోఫెసర్ వైస్ ఛాన్సలర్ ఆచార్య డి నారాయణరావు మాట్లాడుతూ. పరిశోధనల కారణంగానే సంపద సృష్టి జరుగుతుందన్నారు. అనంతరం అతిథులకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ కోశాధికారి ప్రొఫెసర్ రఘునాథన్, కార్యదర్శి ప్రొఫెసర్ విజయమోహన్ పిళ్లై, సదస్సుల కన్వీనర్ రంజిత్ థాపా పాల్గొన్నారు.



వేలాదిగా తరలి వస్తోన్న విద్యార్థులు

ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఇస్రో, కేంద్ర అణు ఇంధనశాఖలు ఏర్పాటు చేసిన మెగా శాస్త్ర సాంకేతిక ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. గురు, శుక్రవారాల్లో సుమారు 8 వేల మంది విద్యార్థులు ఎగ్జిబిషన్లను సందర్శించారు. . తమిళనాడులోని కల్పాకం నుంచి వచ్చిన ఐజీకార్ ప్రతినిధులు న్యూక్లియర్ ఇంధన తయారీకి ఉపయోగించే మూడు దశల రియాక్టర్లను ప్రదర్శనలో ఉంచారు. దేశీయంగా అభివృద్ధి చేసిన టెక్నాలజీని విద్యార్థులకు వివరిస్తూ రియాక్టర్లు, వాటి పనితీరు, రేడియేషన్ వివరాలను తెలియజేస్తున్నారు. ఐజీకార్ నుంచి వచ్చిన ఇంజినీరింగ్ హెడ్ జలజ మదన్మోహన్, డాక్టర్ జగదీశ్వర్, పార్థీపన్, రాము తదితరులు ఎగ్జిబిషన్ వివరాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. అదేవిధంగా ఇస్రో అధికారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను సైతం విద్యార్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇస్రో ప్రతినిధులు వారికి వివరాలు తెలియజేస్తున్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, తెనాలి ప్రాంతాలకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లు, కాలేజీల విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.





అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ చేపట్టే అభివద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలను పక్కాగా పాటించాలని, పనులను ఇంజినీరింగ్ అధికారులు నేరుగా పరిశీలించాలని నగర కమిషనరు కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను అదేశించారు. శుక్రవారం కమిషనరు నిర్మాణంలో ఉన్న రామనామ క్షేత్రం రోడ్ కల్వర్ట్, నిర్మాణం జరిగిన సిసి డ్రైన్, సంపత్ నగర్ పార్క్‌లోని స్కేటింగ్ రింగ్‌ని అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి తనిఖీ చేసి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామనామ క్షేత్రం రోడ్ కల్వర్ట్, మెయిన్ రోడ్డులో నిర్మాణం చేసిన సి.సి. డ్రైయిన్ కొలతలను యం.బుక్ ప్రకారము ఉన్నదీ లేనిదీ పరిశీలించి, డ్రైన్ నాణ్యతను రీబౌండ్ హ్యామర్‌తో తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యతా లోపాలు గుర్తిస్తే కాంట్రాక్టర్ తో పాటు ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శుల పై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. సంపత్ నగర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన స్కేటింగ్ రింగ్‌ని పరిశీలించి, చుట్టుపక్కల పరిసరాల పిల్లలకు ఆటవిడుపు కేంద్రంగా పార్క్‌ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ శివ నారయణ శర్మ, కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ. సుందర్రామిరెడ్డి, డి.ఈ.ఈ. రమేష్ బాబు, ఏ.ఈ. రాంబాబు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన సిసి డ్రైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నూతన అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం నూతన అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తున్నట్లు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గ పరిధిలోని చౌడవరంలో, నల్లపాడులో, గోరంట్లలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వై.యస్.ఆర్. అర్బన్ హెల్త్ సెంటర్లను ఎమ్మెల్యే మేకతోటి సుచరితతో కలిసి మేయర్ శుక్రవారం ప్రారంభించారు. గుంటూరు నగరంలో రూ.14 కోట్లతో 16 అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రభుత్వం నిర్మిస్తుందని, వాటిలో కొన్ని నిర్మాణం పూర్తి అయ్యి ప్రారంభించటం జరిగిందన్నారు. ఒక్కో హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.95 లక్షల నుండి రూ.1 కోటి వరకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాదాన్యతనిస్తుందని, రాష్ట్రంలో వైద్య రంగం బలోపేతం చేయటానికి, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటానికి రాష్ట్రంలో అవసరమైన అన్ని చోట్ల హెల్త్ సెంటర్లు నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్యామల వెంకట రమణ దేవి, చల్లా రాజ్యలక్ష్మి, యర్రంశెట్టి పద్మావతి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

స్థానిక 52వ డివిజన్‌లోని అరండల్ పేట 7/2లో సిసి రోడ్డు నిర్మాణానికి మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నూతన పాలక వర్గం ఏర్పడ్డాక పార్టీలకు అతీతంగా నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రూ.180 కోట్ల విలువైన పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లెబోయిన శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.



యుపిహెచ్‌సిని ప్రారంభించిన మేయర్, ఎమ్మెల్యే సుచరిత తదితరులు